# పంచముఖి, షణ్ముఖి తాళావధానాలు

శ్రీ కొమ్మాజోశ్యుల సద్గురుచరణ్, సెల్ : 9440709994

**కర్ణాటక సంగీత రంగానికి తలమానికంగా నిలచే 'మద్రాసు మ్యూజిక్ అకాడమీ'లో మళ్లా ఓ తెలుగు విద్వాంసుడు అపూర్వమైన ఈ 'తాళావధాన' ప్రక్రియను దిగ్గంతులైన పండితులు న్యాయ మూర్తులుగా నిలవగా, ప్రపంచ సంగీత రంగమంతా 'లైవ్'లో చూస్తుండగా ప్రదర్శించి తెలుగుల వెలుగు నింపారు. పండితులైన సంగీత కళాకారులందరూ లేచినిలబడి కరతాళధ్వనులతో వారి ప్రతిభను కొనియాడారు. అతడే శ్రీ కొమ్మాజోశ్యుల సద్గురు చరణ్, టాప్ గ్రేడ్ మృదంగ విద్వాంసులు. ఆకాశవాణి విజయవాడ కేంద్ర మృదంగ నిలయ విద్వాంసులు.**

**ఇక అవధాన ప్రక్రియ గురించి విశేషాలు చదవండి.**

పంచముఖి, షణ్ముఖి తాళావధానాలు చాలా పురాతనమైన లయకు సంబంధించి ఎంతో క్లిష్టమైన ప్రక్రియలు. ఇవి కర్ణాటక సంగీతంలో మాత్రమే వివరించబడిన అపూర్వమైన తాళ ప్రక్రియలు. ఒక సంగీత విద్వాంసుని లయ జ్ఞానానికి, ఏకాగ్రతకు, ధారణకు అత్యంత కఠోరమైన పరీక్షలుగా వీటిని పేర్కొనవచ్చు.

ఈ తాళావధానాల ఆవిర్భావానికి సంబంధించిన పౌరాణిక గాథ "నంది భరతం" అనే పురాతన సంస్కృత గ్రంథంలో వివరించబడింది. ఇవి ఈశ్వర పంచముఖి, విష్ణు పంచముఖి, బ్రహ్మ పంచముఖి, ఆంజనేయ షట్కాల షణ్ముఖి అని నాలుగు రకాలు. వీనిని వరుసగా ఈశ్వరుడు, విష్ణువు, బ్రహ్మ, ఆంజనేయుడు ప్రదర్శించేరని ఈ గ్రంథం ద్వారా తెలుస్తుంది. పురాణాలలో వివరించబడిన ఈ సంక్లిష్టమైన అవధానాలను వెలికితీసి మానవ మాత్రులకు కూడా ఇవి సాధ్యమేనని నిరూపించిన మహా మనిషి 'పంచముఖీ పరమేశ్వర' 'పుంభావసరస్వతీ, 'హరికథా పితామహ' శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణ దాసుగారు. తిరువయ్యారు సుబ్రహ్మణ్య అయ్యర్ అనే గొప్ప సంగీత విద్వాంసులు ఒకసారి విజయనగరంలోని మహారాజా విజయరామ గజపతుల వారి ఆస్థానానికి విచ్చేసి, రెండు చేతులతో రెండు తాళాలను ఏకకాలంలో చూపిస్తూ పల్లవిని గానం చేశారు. ఎంతో క్లిష్టమైన ఈ ద్వితాళావధానాన్ని అత్యంత నిర్దుష్టంగా గానం చేసిన సుబ్రహ్మణ్య అయ్యర్ గారిని ఎంతో మెచ్చుకొని ఘనంగా సన్మానించేరు మహారాజావారు. అయితే ఎవరైనా ఈ ప్రక్రియను చేసి చూపించగలిగితే తన బిరుదలన్నింటినీ వదులుకుంటాననీ, లేని పక్షంలో ఓటమిని అంగీకరిస్తూ విజయపత్రం రాసివ్వవలసిందనీ ఆస్థాన విద్వాంసులను సవాల్ చేశారు అయ్యర్ గారు. సభలోంచి నారాయణ దాసు గారు వచ్చి అయ్యర్ గారు కలలోకూడా ఊహించలేని విధంగా ఐదు శరీరాంగాలతో ఏక కాలంలో పంచజాతుల ఏక తాళాల యొక్క సశబ్ద క్రియలను చూపిస్తూ పల్లవి పాడి అనితర సాధ్యమైన పంచముఖీ తాళావధానాన్ని చేసి సుబ్రహ్మణ్య అయ్యర్ సవాల్‌ని ఛిన్నాభిన్నం చేసి విద్యల నగరం ప్రతిష్ఠను ద్విగుణీకృతం చేశారు. ఓటమిని అంగీకరించి విజయనగరం వదిలి వెళ్లిపోయారు అయ్యర్ గారు.

ఇంక, ఇందులోని సాంకేతిక అంశాలకు వస్తే, గణిత పరంగా ఒకసారి ఐదు అంగాలూ, ఐదు తాళాలను ఒకేసారి చూపించడం మొదలు పెడితే తిరిగి 1260 క్రియలకు అన్ని అంగాలు ఒకేసారి కలుస్తాయి. (3, 4, 5, 7, 9 ల కనిష్ఠ సామాన్య గుణిజం = $4\times5\times7\times9 = 1260$)

1. ఇలా రెండు చేతులు, రెండు భుజాలు, తలతో ఒకేసారి తాళాలను మొదలుపెట్టి 'ఆదిత్యమంబికాం విష్ణుం గణనాథం,


మహేశ్వరం భజ' అనే 28 అక్షరాల సర్వదేవతా స్తుతిని 45 రాగాల మాలికగా గానం చేసేవారు దాసుగారు. పంచముఖి యొక్క ఒక ఆవృత్తానికి ఈ రాగమాలిక సరిగ్గా సరిపోతుంది. (28×45 = 1260) ఈ అవధానాన్నే 'ఈశ్వర పంచముఖి' అని కూడా అంటారు. తర్వాత కొన్ని సంవత్సరాలకు సంగీత, సాహిత్య రంగాలలో దాసుగారి ప్రతిభకు పరాకాష్ఠగా చెప్పుకునే 'దశవిధరాగ నవతి కుసుమమంజరి' అనే 90 రాగాల రాగమాలికను సంస్కృతాంధ్రాలలో దేవీ స్తుతిగా రచించారు. అక్షరకాల సాహిత్యం, రాగముద్రలు వంటి అనేక ప్రత్యేకతలు కలిగిన రచన ఇది. (1) అంటే పంచముఖియొక్క ఒక ఆవృత్తానికి 1260 క్రియలు అన్న మాట. ఇంతటి అత్యద్భుతమైన, అతి క్లిష్టమైన రచనను గానంచేస్తూ పంచముఖీ అవధానం చేసేవారు దాసుగారు. తరువాత కాలంలో 63 అక్షరాల లఘు శేఖరమనే ఆరవ అంగాన్ని కూడా జోడించి షణ్ముఖిని కూడా ప్రదర్శించేరు వారు. వీరి తర్వాత విజయనగరం జిల్లా చీపురుపల్లి పట్టణానికి చెందిన శ్రీ ముట్నూరు సూర్యనారాయణ శాస్త్రి గారు పన్నెండు సంవత్సరాలపాటు కఠోర సాధన చేసి ఈశ్వర పంచముఖి మాత్రమే కాకుండా విష్ణు బ్రహ్మ పంచముఖులను, ఆంజనేయ షట్కాల షణ్ముఖిని కూడా చేసి చూపించారు. వీరు నంది భరతం గ్రంధాన్ని 'నందీశ్వర భరతం' పేరుతో తెలుగులోకి అనువదించారు. దేశంలోని అనేక చోట్ల ఈ అవధానాలను ప్రదర్శించి ఎన్నో సన్మానాలను పొందారు. 1966లో మద్రాసు మ్యూజిక్ అకాడమీలో వీరు చేసిన ప్రదర్శన ప్రముఖ విద్వాంసులు పాల్ఘాట్ శ్రీ టి.యస్. మణి అయ్యర్, సెమ్మంగుడి శ్రీ ఆర్. శ్రీనివాసయ్యర్ వంటి వారి ప్రశంసలను అందుకొంది. ఈ అవధానాలన్నింటిని వివరించడం ప్రస్తుతం సాధ్యంకాని పని. ఇప్పటి వరకు ఈ అవధానాలను చేసినవారందరూ తెలుగువారే కావడం గమనించదగ్గ విషయం. కర్ణాటక సంగీతానికే తలమానికమైన, తెలుగు వారందరికీ గర్వకారణమైన ఈ అవధానాలను ఆదరించి, ప్రచారం చేసి తర్వాతి తరాలకు అందించడం మన బాధ్యత.

**ఈ అవధానాన్ని చూడదలచుకొన్నవారు యుట్యూబ్‌లో 'సద్గురు చరణ్ పంచముఖి' అని టైపు చేసి వీక్షింపవచ్చు**

## శ్రీ సద్గురుచరణ్‌కు మద్రాసు మ్యూజిక్ అకాడమీ వారిచ్చిన ప్రశంసాపత్రం

## TO WHOMSOEVER IT MAY CONCERN

Shri K.Sadguru Charn, Staff Artiste (Mridangam) All India Radio, Vijayawada, successfully demonstrated "Panchamukhi and Shatkala Shanmukhi avadhana - s" on 23rd December, 2018 as part of the 92nd Annual Conference of the Music Academy, Madras. This was well appreciated by Vidwans and Music Lovers as well. His performance was examined and approved by Vidwans - the Malladi Brothers (Shri Sriram Prasad & Shri Ravi Kumar), Shri B V Balasai, Shri Patri Satish Kumar and Shri TKV Ramanujacharyalu. The performance had Sangita Kalanidhi Vidushi Smt Aruna Sairam presiding and she praised it as well.



V Sriram, Convener - Secretary The Music Academy, Madras 06.03.2019